క్లుప్తంగా

విజయసాయిరెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే కదిరి



విజయసాయిరెడ్డికి బొకే అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు

సీఎస్‌పురం (పామూరు): ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డిని శాలువాతో సన్మానించి, బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్‌ని బలోపేతం చేద్దాం

కనిగిరి రూరల్: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు పని చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశం పిల్లి వెంకటేశ్వరరెడ్డి, వేల్పుల రాజశేఖర్‌ల అధ్యక్షతన నిర్వహించారు. రసూల్, ఉంగరాల శ్రీనివాస్, సుబ్బారెడ్డి, మహబూబ్ బాషా, ఈదర వెంకటరెడ్డి, సంగటి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న జేడీ బేబీరాణి

కొండపి(సింగరాయకొండ): పాడిరైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని పశుసంవర్ధకశాఖ జేడీ కె.బేబీరాణి అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కొండపి మండలం కె.ఉప్పలపాడులో జగనన్న పాలవెల్లువ పథకానికి సంబంధించి మంగళవారం రుణమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా పాడి రైతుల అభివృద్ధికి సహకార సంఘాలను ఏర్పాటు చేసి వాటికి రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా కల్పించిందని వివరించారు. జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా ఇప్పటివరకు ఆరుసార్లు పాలసేకరణ ధర పెంచామని గుర్తు చేశారు. గేదెల కొనుగోలుకు పీడీసీసీ బ్యాంకు ద్వారా రుణాలు అందజేస్తున్నామని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను, టీఎంఆర్, గ్రాస్ కట్టర్‌లను అందిస్తున్నామన్నారు. డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఢాకా పిచ్చిరెడ్డి, డాక్టర్ కె.రమేష్‌బాబు, డాక్టర్ బి.పేరయ్య, ఎంపీడీఓ రమణమూర్తి, ఏపీఎం రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోదండరామస్వామి ఆస్తులను పరిరక్షిస్తాం

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీలో కోదండరామస్వామి దేవస్థానం ఆస్తుల పరిరక్షణకు కృషి చేస్తామని దేవాదాయశాఖ ఎండోమెంటు కమిషనర్ పి శ్రీనివాసులరెడ్డి అన్నారు. శ్రీకోదండరామస్వామి ఆలయ ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలని మంగళవారం గ్రామస్తులు ఒంగోలులోని ఆయన కార్యాలయంలో కలిశారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఆలయ ఆస్తులకు భద్రత లేకుండా పోయిందని భూములపై వచ్చే కౌలు కూడా అన్యాక్రాంతమవుతోందని దేవునికి నిత్యదీపారాధన జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. దేవాలయ ఆస్తులకు భద్రత కల్పించాలని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు తనకు రాతపూర్వకంగా విజ్ఞప్తి చేశారన్నారు. బుధవారం ఊళ్లపాలెం గ్రామంలో ఆలయ ఆస్తులను పరిశీలించి వాటికి వెంటనే వేలంపాటలు వేయాలని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యన్నారాయణను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పీవీరెడ్డి, పాకనాటి సుబ్బారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



సీఎస్‌పురంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



రాజుపాలెం పాఠశాలలో అ అక్షరాకృతిలో విద్యార్థుల ప్రదర్శన



హెచ్‌ఎంపాడు జిల్లా పరిషత్ పాఠశాల్లో తెలుగు పద్యాలు పాడుతున్న విద్యార్థులు

హనుమంతునిపాడు: మండలంలో హనుమంతునిపాడు, సీతారాంపురం, చిన్నముప్పళ్లపాడు, మహమ్మదాపురం, పెద్దగొల్లపల్లి, వాలిచర్ల, నందనవనం, కస్తూరిబా బాలికల పాఠశాలల్లో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం జీవీ సురేష్‌బాబు, పద్మావతి, కుడారి రామోహన్‌రావు, శ్రీనివాసరావు, నారాయణరెడ్డి, పీడీలు షేక్ జిలానీ, అరుణ్, ఉపాధ్యాయులు బి.సుబ్బారావు, ఎంకట్రావు, నాలి వెంకటయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పామూరు: విద్యార్థులు విద్యతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని పాఠశాల హెచ్‌ఎం సయ్యద్ ఇసాక్ అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురం జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం గిడుగు రామ్మూర్తి జయంతి (మాతృభాషా దినోత్సవం), హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి (జాతీయ క్రీడా దినోత్సవం) సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, క్రీడలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాతృభాషా దినోత్సవం గురించి మాట్లాడుతూ పాశ్చాత్య మోజులో పడి నేటి యువత మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, మాతృభాషను మరిస్తే వారు కన్నతల్లిని మరిచినట్లేనన్నారు. అదేవిధంగా విద్యతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వంతో పాటు ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ముందుగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పీవీ క్రిష్ణమోహన్, సయ్యద్ ఖాదర్‌వలి, షేక్.ఖాజాహుసేన్, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): మండలంలో మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాల కార్యక్రమాలు విద్యార్థుల్లో నూతనోత్తేజాన్ని నింపాయి. ఈసందర్భంగా సీఎస్‌పురం జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం ఖాదరున్నీసా, తిమ్మరాజుపల్లి హెచ్‌ఎం చెన్నకేశవులు మాతృభాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా విద్యార్థులకు క్రీడల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.



వెన్నూరు జెడ్పీ హైస్కూల్లో..

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి

జరుగుమల్లి: విద్యార్థుల్లో పోటీతత్వం, నాయకత్వ లక్షణాలు పెంపొందించాలని ఎంపీడీఓ కె.జలజాక్షి సూచించారు. ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు బాషా దినోత్సవాలను మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఎంపీడీఓ జలజాక్షి, క్రీడా పతాకాన్ని ఎస్సై వెంకటేశ్వరరావు ఎగుర వేశారు. ధ్యాన్‌చంద్, గిడుగు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల మైదానంలో క్రీడా జ్యోతి వెలిగించారు. బాలికల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. క్రీడా పోటీల్లో విజేతలకు మెడల్స్ బహూకరించారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ బత్తుల నాగేంద్రవదన్, ఎంఈఓ-2 డోలా శ్రీనివాసరావు, పాఠశాల పీడీ ఎస్‌టీ రమేష్, ఉపాధ్యాయులు, బాలబాలికలు పాల్గొన్నారు.

కామేపల్లి జిల్లా పరిషత్ స్కూల్లో క్రీడా పోటీల విజేతలకు హెచ్‌ఎం అనూరాధ మెడల్స్, ప్రశంస పత్రాలు అందజేశారు. గ్రామానికి చెందిన ఏలూరి రాంబాబు రూ:16 వేల విలువైన క్రీడా సామగ్రి అందజేశారు. దాతను ఉపాధ్యాయులు సత్కరించారు.

మర్రిపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు ఎంఈఓ ప్రసాద్ రెడ్డి, రెబ్బా వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తంగెళ్ల హైస్కూల్లో క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలను హెచ్‌ఎం ఉయ్యాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

టంగుటూరు: జమ్ములపాలెం, ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. జమ్ములపాలెం పాఠశాలలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఆలకూరపాడు హైస్కూల్లో అనర్గళంగా సుమతీ శతకాన్ని ధారణ చేసిన పుట్టా భార్గవి, నాగ చైతన్యను అభినదించి రూ.1000 నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 తన్నీరు బాలాజీ, ప్రధానోపాధ్యాయులు వాకా వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, పీడీలు వెంకట్రావు, తులిబిలి అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: కలికవాయ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం నిడమానూరి సురేంద్ర ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆటలపోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు చామల వేణుగోపాలరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పాతసింగరాయకొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలు నిర్వహించారు.

కొండపి మండలం వెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం భారతి మాట్లాడుతూ.. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి పంతులు, క్రీడాభివృద్ధికి మేజర్ ధ్యాన్‌చంద్ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.



పామూరులో గిడుగు రామ్మూర్తి చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



మర్రిపూడిలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈఓ



జమ్ములపాలెంలో క్రీడా దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



జరుగుమల్లి హైస్కూల్లో క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎంపీడీఓ, ఎస్సై



కలికవాయ ప్రాథమికోన్నత పాఠశాలలో..

నరేంద్ర మోదీ విఫల ప్రధాని

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం
- దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ ప్రభుత్వం
- 9 ఏళ్ల మోదీ పాలనలో పెరిగిన పేదరికం



ర్యాలీలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణా, పార్టీ నేతలు

కనిగిరి రూరల్: దేశంలోని వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేసిన నరేంద్ర మోదీ విఫల ప్రధాని అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. సీపీఐ బస్సు యాత్ర కనిగిరి చేరి, స్థానిక సయ్యద్ హనీఫ్ నగర్ స్థూపం వద్ద నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పామూరు బస్టాండ్‌లో గుజ్జుల యల్లమందారెడ్డి, సరళా దేవి విగ్రహాలకు కె.రామకృష్ణా, ఆ పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం బస్టాండ్‌లో ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ యాసీన్ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వంలో మత విద్వేషాలు తీవ్రంగా పెరిగాయని ఘాటుగా విమర్శించారు. బీజేపీ మతతత్వ పాలనలో మతాల పేరిట, మరణహోమాలు, విద్వేషాలు పెరిగి దేశంలో అల్లర్లు జరుగుతున్నాయని విమర్శించారు. మణిపూర్‌లో అల్లర్లలో సుమారు 159 మంది అన్యాయంగా చంపారని, ప్రధాని మోదీ కనీసం నోరు మెదపలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని తీవ్రంగా దుయ్యబట్టారు. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో రైతులు, ప్రజలు, సామాన్యులు పేదరికంతో అల్లాడుతున్నారన్నారు. నిత్యవసర ధరలు నింగిని అంటాయని విమర్శించారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన మోది నిరుద్యోగులను నిలువునా మోసం చేశాడని ధ్వజమెత్తారు. మోదీ ముందస్తు ఎన్నికలకు వెళితే ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సన్నద్ధంగా ఉన్నారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు వై రవీంద్ర బాబు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి, పార్టీ నాయకులు అందే నాసరయ్య, డి శ్రీనివాస్, ఎం రమేష్, కృష్ణా గౌడ్, పోతల ప్రభాకర్, పి.రాజేంద్ర, లెనిన్‌బాబు, జాన్సన్ బాబు, శివారెడ్డి, చంద్ర నాయక్, పెంచలయ్య, రామకృష్ణా, జీపీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డికి సన్మానం



కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ, పార్టీ శ్రేణులు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారిగా నియమితులైన మాజీ ఎంపీటీసీ మండాది కృష్ణారెడ్డిని మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ అట్లా రామచంద్రారెడ్డి, సర్పంచ్‌లు దామిరెడ్డి నాగేంద్ర, లోకిరెడ్డి అంకిరెడ్డి, బ్రహ్మరెడ్డి, రమేష్, సంగు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే

పీసీపల్లి: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం బీఎల్ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క బీఎల్ఓ డోర్ టు డోర్ తిరిగి మరణాలు, మార్పులు, చేర్పులు పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చిరస్మరణీయుడు అబ్దుల్ బషీర్



బషీర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ గఫార్, ఎన్జీఓ నేతలు, ఎంపీపీ ప్రకాశం

కనిగిరి రూరల్: దివంగత ఎన్జీఓ సంఘనేత అబ్దుల్ బషీర్ చిరస్మరణీయుడని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. అబ్దుల్ బషీర్ తృతీయ వర్ధంతిని పురస్కరించుకొని ఎన్జీఓ కార్యాలయంలో బషీర్ చిత్రపటానికి సంఘ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, ఎంపీపీ ప్రకాశం మాట్లాడుతూ బషీర్ ఎన్జీఓ సంఘ నేతగా ఉద్యోగ వర్గాలకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా మాట్లాడుతూ ఎన్జీఓ నేతగా బషీర్ అందరి మన్ననలను పొందారన్నారు. బషీర్ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గఫార్ స్థానిక ప్రభుత్వ వైద్య శాలలో రోగులకు బ్రెడ్లు, దుప్పట్లు, మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. గార్లపేట రోడ్డులోని వృద్ధాశ్రమంలో అనాథలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. కుటుంబసభ్యులు మదరసాలో బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కుటుంబ సభ్యులు జలీల్, హబీబ్, షరీపుద్దీన్, విశ్రాంత తహసీల్దార్ దావూద్, విశ్రాంత హెచ్‌ఎం మస్తాన్‌వలి, ఎన్జీవో సంఘ నాయకులు పిల్లి వెంకట రమణారెడ్డి, సింగంపల్లి రాంప్రసాద్, చిలకల శివరామిరెడ్డి, నరసింహారావు, ఎస్‌కే హజరత్ అలీ, విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు టి.పెద్దిరెడ్డి, కరీముల్లా, వికలాంగుల సంఘ రాష్ట్ర నాయకుడు డి. మల్లికార్జునరావు, కోఆప్షన్ సభ్యుడు జి.అబ్రహాం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలంతా పాఠశాలల్లో చేరాలి



మాట్లాడుతున్న ఎంఈఓ జి పెద్దిరాజు

హనుమంతునిపాడు: బడిబయట ఉన్న పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్చాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ జీవీ కృష్ణారావు, ఎంఈఓ జి.పెద్దిరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, పాఠశాల సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ పరిధిలో సర్వే నిర్వహించి బడిఈడు పిల్లలంతా బడిలో చేరారా లేదా, వలసలు వెళ్లారా అన్నది గుర్తించాలన్నారు. వలసలు వెళ్లిన ప్రాంతంలో విద్యార్థి బడిలో చేరారా లేదా తెలుసుకోవాలన్నారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ సిబ్బందికి పాఠశాల సీఆర్పీలు కూడా మీకు సహకరిస్తారన్నారు. ఎంఈఓలు జి.పెద్దిరాజు,ఎస్.రమణయ్య, సీఆర్పీలు పవిత్ర,చిన్న బాదుర్ల, తదితరులున్నారు.

ప్రతి ఇంటికీ మెరుగైన వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సందీప్

హనుమంతునిపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్న ఇంటింటికి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరికీ వైద్యులు ఇంటికొచ్చి వైద్య సేవలు అందిస్తున్నారని డాక్టర్ సందీప్ అన్నారు. మంగళవారం దాసరిపల్లి పంచాయతీ పరిధి రెడ్డెంవారిపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ముందుగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇంటింటికీ తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన 104 వైద్య క్యాంపులో 52 మందికి బీపి ,షుగర్,రక్త పరీక్షలు, జలుబు,దగ్గు, తదితర పరీక్షలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఆరోగ్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది ఉన్నారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి



కొండారెడ్డిపల్లిలో నిమ్మతోటలకు పరిశీలిస్తున్న హెచ్‌ఓ

హనుమంతునిపాడు: పండ్ల తోటల సాగు రైతులు ఉద్యానవన అధికారుల సూచనల మేరకు తెగుళ్ల నివారణ మందులు పిచికారీ చేయాలని ఉద్యానవన అధికారి ఎం.అంజలీ బాయి అన్నారు. మండలంలోని కొండారెడ్డిపల్లి, హనుమంతునిపాడు గ్రామాల్లో సాగులో ఉన్న నిమ్మతోటలను పరిశీలించారు. ఆర్‌బీ కేంద్రాల పరిధిలో నిమ్మ, ఉద్యానవన పంటల సాగు అధికారులతో సమావేశమయ్యారు. నిమ్మ తోటలకు సోకిన తెగుళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. కాయ మంగు తెగుళ్ల నివారణకు, మానుకుళ్లు, వేరుకుళ్లు, ఆకు ముడత, ఆకు రాలకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సలహాలు సూచలిచ్చారు. వీఏఏలు, బి.సాయి, ఎస్‌కే ఖదీర్, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశం

కనిగిరి రూరల్: మహిళా సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో మంగళవారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రకాశం మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి అనేక పథకాలు చేపడతున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి పథకంలో మహిళలకే ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వివరించారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి మాట్లాడుతూ మహిళా అభ్యున్నతే ధ్యేయంగా సీఎం అనేక పథకాలను చేపట్టినట్లు చెప్పారు. సున్నావడ్డీ, పొదుపు రుణాలు, వైఎస్సార్ చేయూత, అసరా వంటి బృహత్తర పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందించే పథకాలను, రాయితీలను అర్హత కల్గిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఏరియా కో ఆర్డినేటర్ కత్తి కళ్యాణ్ మాట్లాడుతూ మండల సమాఖ్య లోటు బడ్జెట్‌ను భర్తీ చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, గ్రామ సంఘాల బలోపేతం, సభ్యత్వం, రుణాల రికవరీ తదితర అంశాలను గూర్చి వివరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం జీవరత్నం, సీసీలు, ఎంఎస్‌ఏలు, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల జాబితా పరిశీలన



ఓట్ల జాబితాను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

హనుమంతునిపాడు: ఇంటింటి ఓట్ల తనిఖీ పరిశీలనలో బూత్ లెవల్ అధికారులు తొలగించిన ఓట్ల జాబితాను మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ టీమ్ అధికారి కట్టా ధర్మతేజ, సూపర్‌వైజర్ కాకర్ల రమణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలన 23 గ్రామ పంచాయతీలో 29 బూత్‌లో బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితా ప్రకారం పరిశీలించారు. మరణించిన వారి ఓట్లు, గ్రామాల నుంచి శాశ్వితంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓట్లు, డబుల్ ఎంట్రీ ఉన్న వారి ఓట్లు పరిశీలనలో 230 ఉన్నట్లు గుర్తించారు. రెండు రోజుల నుంచి డివిజన్ అధికారి ఆధ్వర్యంలో ఓట్ల జాబితాను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

కేజీబీవీ విద్యార్థుల సత్తా



ప్రతిభ చాటిన సీఎస్‌పురం కేజీబివి విద్యార్థులు

సీఎస్‌పురం (పామూరు): సౌత్‌ఇండియా కరాటే, కుంపూ టోర్నమెంట్‌లో స్థానిక కేజీబీవీ విద్యార్థులు సత్తా చాటి మెడల్స్, టోర్నీ కప్ సాధించారు. రంగారెడ్డి జిల్లా కుందుర్గ మండలం జీఎం పటేల్ గార్డెన్స్‌లో జరిగిన పోటీల్లో అండర్ 12 కేటగిరి కత విభాగంలో లావణ్య, సరస్వతిలు గోల్డ్ మెడల్, అపర్ణ సిల్వర్ మెడల్ సాధించారు. అండర్ 13లో మాధురి గోల్డ్‌మెడల్, నాగేశ్వరి, రమ్యలు సిల్వర్ మెడల్ సాధించారు. అండర్ 14 విభాగంలో పూజ గోల్డ్‌మెడల్, అక్షయ బ్రాంజ్ మెడల్ సాధించారు. అండర్ 15లో కత విభాగంలో శృతి, వెన్నెల గోల్డ్‌మెడల్, నిఖిల, భవానీలు సిల్వర్ మెడల్, ఎం శ్రావణి బ్రాంజ్‌మెడల్ సాధించారు. అండర్ 16లో చందన సిల్వర్ మెడల్, అండర్ 17లో సాయిబృంద గోల్డ్‌మెడల్ సాధించి సత్తాచాటారని విద్యాలయం ఎస్ఓ రేష్మ తెలిపారు.